సాక్షి ఒడిశా

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



అంబరాన్నంటిన..

ఘంటసాల ఆరాధనోత్సవాలు అంబరాన్నంటాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో



బాధితులకు భరోసా

కాలవైశాఖి బాధితులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చింది. నిత్యావసరాలు అందించారు.

- 8లో



మద్యం విక్రయాలపై..

మద్యం విక్రయాలపై వివాదం జరిగింది. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

సోనియా, రాహుల్‌లపై బీజేవైఎం ఆగ్రహం



భువనేశ్వర్‌లో మాస్టర్ క్యాంటీన్ చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

కొరాపుట్: రాష్ట్ర రాజధానిలో భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా కార్యకర్తలు ఆదివారం భారీ ఆందోళన చేశారు. భువనేశ్వర్‌లోని మాస్టర్ క్యాంటీన్ చౌక్ వద్ద సోనియా గాంధీ, రాహుల్ గాంధీల చిత్రపటాలతో నిరసన చేశారు. తక్షణం ఈడీ ముందు హాజరు కావాలన్నారు. వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఖేల్ ఇండియా సెంటర్లు ప్రారంభం



ఖేల్ ఇండియా సెంటర్స్ ని ప్రారంభిస్తున్న రాష్ట్ర క్రీడా మంత్రి సూరజ్ సూర్య వంశీ

కొరాపుట్: రాష్ట్ర వ్యాప్తంగా ఖేల్ ఇండియా సెంటర్స్‌ని రాష్ట్ర ఉన్నత విద్య, స్పోర్ట్స్, యూత్ సర్వీసెస్ మంత్రి సూరజ్ సూర్యవంశీ ప్రారంభించారు. ఆదివారం భువనేశ్వర్‌లోని తన కార్యాలయంలో వర్చువల్ విధానంలో ఈ కేంద్రాలను ప్రారంభించారు. తొలి విడతగా ప్రతి జిల్లాకు ఇదే వేదిక మీద రు.5 లక్షలు చొప్పున విడుదల చేశారు.

లక్ష్మీపూర్‌లో సైబర్ మోసం



బాధితుడు త్రినాథ్ మహాపాత్రో

కొరాపుట్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు సైబర్ మోసానికి గురయ్యారు. లక్ష్మీపూర్ సమితి కార్యాలయ సమీపంలో నివాసముంటున్న టీచర్ త్రినాథ్ మహాపాత్రోకి ఆదివారం ఓ ఫోన్‌కాల్ వచ్చింది. హెడీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, డెబిట్ కార్డుకి లింక్ పంపుతున్నామని, ఓటీపీ చెప్పాలని కోరారు. బాధితుడు ఓటీపీ చెప్పిన వెంటనే క్షణాల్లో రూ.19,600 అతని అకౌంట్ నుంచి కట్ అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీ దగ్ధం



తగలబడుతున్న లారీ

రాయగడ: జిల్లాలో మునిగుడ పోలీసుస్టేషన్ పరిధిలోని మినీ స్టేడియం సమీపంలో శనివారం రాత్రి ఒక లారీ దగ్ధమైంది. విశాఖపట్నం నుంచి ఇనుప రాడ్ల లోడ్‌తో రాజపూర్ వెళ్తున్న లారీలో మునిగుడ మినీ స్టేడియంకు చేరుకునేసరికి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి తగులబడింది. లారీలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి అగ్ని ప్రమాదానికి గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. అదే సమయంలో లారీని నడుపుతున్న డ్రైవర్ బయటకు దూకి ప్రాణాలు కాపాడుకోగలిగాడు. సమాచారం తెలుసుకున్న మునిగుడ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటల కారణంగా లారీ ఇంజిన్, టైర్లు, క్యాబిన్ వంటివి పూర్తిగా దగ్ధమయ్యాయి.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో బాధితుడు

కొరాపుట్: ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం ఉదయం కొరాపుట్ జిల్లా కేంద్రం సమీపంలో మస్తిపుట్ లయిచన్ ఖొర అనే వ్యక్తి గ్రామ పొలిమేరలో నడుస్తుండగా ఓ ఎలుగుబంటి అకస్మాత్తుగా దాడి చేసింది. బాధితుడి మెడ పట్టుకొని లాక్కుపోయింది. గమనించిన గ్రామస్తులు మూకుమ్మడిగా దాడి చేయడంతో బాధితుడిని వదిలి అడవిలోకి పారిపోయింది. అనంతరం బాధితుడిని కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ సండే



పట్టణంలో ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు



అందంగా తీర్చిదిద్దిన సమాధులు



సమాధి ప్రాంతంలో పోటెత్తిన జనం



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జయపురంలో ఆదివారం ఈస్టర్ సండే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5 గంటలకు వందలాది మంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానాన్ని తెలిపే కరపత్రాలు పంచారు. సమాధులపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

– జయపురం

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



సహకార సంఘాల చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరం పురస్కరించుకొని కలెక్టరేట్ వద్ద ఒక చైతన్య రథాన్ని జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్ పచ్చజెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. సహకార సంఘాలు ఏర్పాటు వల్ల రైతులకు రుణాలు మంజూరు చేయడానికి జిల్లాలో ఉన్న 50 ప్యాక్స్, ల్యాంప్స్‌లు 100కి పెరిగాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ప్యాక్స్ (ప్రాథమిక పరపతి సంఘం) ద్వారా రూ.5 లక్షల రుణం ప్రభుత్వం అందజేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ హరిహర శెఠి తదితరులు పాల్గొన్నారు.

బిజూ ఆరోగ్య సంక్షేమ కార్డులకు మంగళం..?



విశాఖపట్నం ఆస్పత్రిలో బిజూ ఆరోగ్య కార్డులు స్వీకరించక పోవటంతో నిరాశతో వెనుదిరిగిన బొయిపరిగుడ వాసులు

జయపురం: గత ప్రభుత్వం ప్రజలకు సమకూర్చిన బిజూ ఆరోగ్య పథకం కార్డులు విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులు ఆమోదించడం లేదని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొరాపుట్ జిల్లాలో ఆధునిక సౌకర్యాలు లేక ఈ జిల్లాకు చెందిన రోగులు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రంలోని కటక్, లేదా బరంపురంతో పాటు విశాఖ వెళ్తుంటారు. ఎక్కువ మంది విశాఖ వెళ్తారు. గతంలో బిజూ ఆరోగ్య సంక్షేమ కార్డులపై విశాఖలో చికిత్స చేయించుకునే వాళ్లమని, కానీ ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైన తేదీ నుంచి బిజూ కార్డులు అనుమతించడం లేదని తెలిపారు. చాలా మంది ఈ కార్డులు పట్టుకుని వైజాగ్ వెళ్లి చికిత్స చేయించుకోలేక అవసోపాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయం బొయిపరిగుడలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పుడు బిజూ పట్నాయిక్ ఆరోగ్య పథకం స్థానంలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ కార్డులు, గోపబంధు జన ఆరోగ్య పథకాలు వచ్చాయని, పాత కార్డులు రద్దయ్యాయని తెలిపారు. పై రెండు పథకాలకు సాఫ్ట్‌వేర్ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయ్యాక అమలులోకి వస్తాయని తెలిపారు. అయితే కొత్త కార్డులు వచ్చే వరకు పాత కార్డులపై చికిత్స పొందే అవకాశం కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న యోగా శిక్షకురాలు సులోచన

రాయగడ: యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సంబల్‌పూర్‌కు యోగా శిక్షకురాలు సులోచన అన్నారు. స్థానిక రైతుల కాలనీలోని నవ జీవన్ ట్రస్టులో ఆదివాసీ విద్యార్థులకు యోగాపై శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ప్రతీ విద్యార్థి యోగాను నిత్యకృత్యంగా అభ్యసించాలన్నారు. యోగా వలన మెదడు చురుగ్గా పనిచేస్తుందని, ఆరోగ్యకరమైన శరీరం సొంతమవుతుందని తెలియజేశారు. ఆశ్రమాల్లోని విద్యార్థులకు నిర్వాహకులు యోగాపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని తదితరులు పాల్గొన్నారు.



యోగాను అభ్యసిస్తున్న విద్యార్థులు

సీఎంతో సుదర్శన్ పట్నాయక్ భేటీ



సుదర్శన్ పట్నాయక్‌ను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి

కొరాపుట్: సీఎం మోహన్ చరణ్ మఝితో ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ భేటీ అయ్యారు. ఇటీవల యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన పోటీల్లో సుదర్శన్‌కి శాండ్ మాస్టర్ అవార్డు లభించింది. అవార్డుతో ఇండియా వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిని కలిశారు. సుదర్శన్‌ను సీఎం శాలువ కప్పి సత్కరించారు.

సీఎంతో స్పెయిన్ అంబాసిడర్ చర్చలు



సీఎం మోహన్ చరణ్ మఝితో స్పెయిన్ అంబాసిడర్ జువాన్ ఆంటోనియో

కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝితో స్పెయిన్ అంబాసిడర్ జువాన్ ఆంటోనియో మార్చ్ పౌజల్ చర్చలు జరిపారు. లోక్ సేవా భవన్‌లో ఆయన సీఎంను కలిశారు. స్పెయిన్–ఇండియా సంబంధాలపై మాట్లాడారు.

ఈడీ ఆఫీసు ముందు ఆందోళన



భువనేశ్వర్‌లో ఈడీ కార్యాయం ముందు ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే తారా ప్రసాద్

కొరాపుట్: భువనేశ్వర్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ డైరెక్టరేట్ ఆఫీస్ ముందు రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. తమ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్రం కక్ష కట్టి అక్రమ కేసులు మోపుతోందని అన్నారు. ఈ వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనకు జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహీణీపతి హాజరయ్యారు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు



హజ్ యాత్రకు వెళ్లే వారితో ప్రార్థనలు చేయిస్తున్న ముస్లిం మత పెద్దలు

కొరాపుట్: హజ్ యాత్రకు వెళ్లే వారికి వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం జయపూర్ పట్టణంలోని సంధ్యా ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రాంతం నుంచి వెళ్తున్న 11 మంది హజ్ యాత్రికులను పిలిపించి సన్మానం చేశారు.అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి గతంలో వెళ్లి వచ్చిన హజ్ యాత్రికులు (హాజీజ్) లు వచ్చి బహుమతులు అందజేశారు. ఈ నెల 22వ తేదీన అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం జరగనుంది.

మే 13 నుంచి విడతల వారీగా హజ్ యాత్రికులు బయల్దేరి వెళ్లనున్నారు. ముస్లిం మత పెద్దలు ఎండీ హజర్ బేగ్, కేఎం ఇషాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ సామూహిక ప్రార్థనలు చేశారు.

సువర్ణపూర్‌లో సింగ్‌దేవ్ దంపతుల పర్యటన



ఉప ముఖ్యమంత్రి కేవీ సింగ్ దేవ్, ఎంపీ సంగీత సింగ్ దేవ్‌ల ర్యాలీ

కొరాపుట్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, అతని సతీమణి బలంగీర్ సంగీతా సింగ్ దేవ్ దంపతులు సువర్ణపూర్ జిల్లాలో పర్యటించారు. ఆదివారం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. చెప్పాపల్లిలో అరుంధతి భందకళా కేంద్రానికి శంకుస్థాపన చేశారు. దంపతులను స్థానికులు సత్కరించారు.



గజమాలతో రాజ దంపతులను సత్కరిస్తున్న సువర్ణపూర్ వాసు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కొరాపుట్: తమ సమస్యలు పరిష్కరించాలని బీడీ ఆకులు సేకరించే కార్మికులు కోరారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఒడిశా కెందు పత్ర కర్మచారా సంఘం అధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజిత్ మహంతి మాట్లాడుతూ బీడీ ఆకుల సేకరణపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బీడీ ఆకులు సేకరించే కార్మికుల ఇంట్లో ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం కెందు బోర్డు ద్వారా ఆర్థిక సాయం అందించేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సహాయాన్ని నిలుపుదల చేస్తుందనే ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో బీడీ ఆకుల సేకరణపై వేలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం మానవతా దృష్టితో బీడీ ఆకులు సేకరించే కార్మికులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఎఫ్‌వో (కెందు లీఫ్) కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నబరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాల సలహాదారుడు కున్ని అధికారి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బీడీ ఆకులు సేకరించే కార్మికులు

‘విశ్వ విద్యాలయంగా ఆమోదించాలి’



గజపతి విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

పర్లాకిమిడి: శ్రీకృష్ణచంద్ర గజపతి (స్వయం ప్రతిపత్తి) కళాశాలకు పూర్వవైభవం రావాలంటే విశ్వవిద్యాలయంగా ప్రభుత్వం ఆమోదించాలని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఆదివారం ఎస్.కె.సి.జి.కళాశాల పూర్వపు విద్యార్థుల సంఘం రెండవ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే రూపేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి గౌరవ అతిథులుగా విశ్రాంత ప్రొఫెసర్ బిపిన్ నాయక్, పూర్వపు విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ శంకర్ ప్రసాద్ భుక్ష్మి, చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సామంతరాయ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్ర పట్నాయిక్, నాజిర్ బేగ్ తదితరులు హాజరయ్యారు. ప్రొఫెసర్ బిపిన్ నాయక్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా సన్మానించారు. అలాగే అంతర్జాతీయ, రాష్ట్ర ఖ్యాతి గాంచిన అథ్లెట్ కిశోర్ చంద్ర రథ్, బిష్ణుమోహన్ అధికారిని అధికారులు సత్కరించారు.

క్లుప్తంగా

మురుగు పారదు.. దుర్గంధం వదలదు



హీరాపురంలో సవర వీధి నుంచి యూపీ పాఠశాలకు వెళ్లే రహదారిలో మురుగుతో నిండిన కాలువ

మెళియాపుట్టి: పరశురాంపురం పంచాయతీ పరిధిలోని హీరాపురం గ్రామంలోని కాలువలు మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. కాలువలు నిండి మురుగునీరు పారకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీని వల్ల వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, మురుగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పంచాయతీ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



నారాయణరావు (ఫైల్)

టెక్కలి రూరల్: ఇంట్లో కరెంట్ లేదని దాన్ని మరమ్మతు చేసే క్రమంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు వదిలేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన పినిమింటి నారాయణరావు(40) అనే వ్యక్తి ఆదివారం తన ఇంట్లో కరెంట్ వచ్చి పోతుండటంతో స్విచ్ బోర్డుకి వచ్చే వైర్లు ఊడిపోవడం గుర్తించి దాన్ని మరమ్మతు చేసేందుకు పూనుకున్నారు. అయితే మరమ్మతు చేసే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడిపోయారు. దీంతో వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి నారాయణరావు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కీర్తన, మహేష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

ఆటో..బైక్ ఢీ: విద్యార్థికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో మండలంలోని పెద్దమడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పడాల విజయ్ అనే విద్యార్థి గాయాల పాలయ్యాడు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన విజయ్ ఆదివారం తన మామయ్య శ్రీనుతో కలిసి బైక్‌పై మెళియాపుట్టి నుంచి తన గ్రామానికి వెళ్తున్నాడు. మెళియాపుట్టి గ్రామ శివార్లలో వస్తున్న ఆటోని బైక్ ఢీకొనడంతో వెనుక కూర్చున్న విజయ్ దూరంగా ఎగిరిపడ్డాడు. దీంతో అతడి కాలికి గాయమైంది. వాహనం నడుపుతున్న శ్రీనుకు సైతం గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరినీ టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం తరలించినట్లు తెలిపారు.

ఆశాజనకంగా చోడి పంట



బుచ్చిపేట వద్ద ఆశాజనకంగా చోడి పంట

నరసన్నపేట: మండలంలో చోడి పంట ఆశాజనకంగా ఉంది. మెట్ట భూములతో పాటు సాగునీటి వసతులు ఉన్న పొలాల్లో రైతులు చోడిని వేశారు. రావులవలస, బొరిగివలస, బుచ్చిపేట, మడపాం, నడగాం, జమ్ము, తామరాపల్లితో పాటు గ్రామాల్లో రైతులు చోడిని వేశారు. మండలంలో 90 ఎకరాల్లో చోడి పంట ఉన్నట్లు వ్యవసాయ అధికారులు లెక్కలు తెలుపుతున్నాయి. గతంలో పోల్చితే చోడి పిండి వినియోగం ఆరోగ్య రీత్యా పెరగడంతో రైతులకు ఆదాయం వస్తుంది.

సత్యనారాయణ నేత్రదానం



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ఇప్పిలి వీధిలో నివాసం ఉంటున్న నారంశెట్టి సత్యనారాయణ (86) అనారోగ్య కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుమారులు ఎన్వీ మెహెర్ సుధాకర్, ఎన్వీ సురేష్, ఎన్వీ రవికిషోర్, జగదీశ్వరరావులు బరాటం వరప్రసాద్ ద్వారా తండ్రి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇంచార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు సత్యనారాయణ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

అంబరాన్నంటిన ఆరాధనోత్సవం



ఘంటసాల ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ఆచార్య డీఎస్ రావు



ఘంటసాల ఆరాధనోత్సవాల్లో పాటలకు డ్యాన్సులు

పర్లాకిమిడి: చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో స్థానిక బిజూ కల్యాణ మండపంలో ఘంటసాల ఆరాధనోత్సవాలను సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎస్ రావు, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ప్రారంభించారు. కార్యక్రమంలో హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహికూడా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం మెగా మెడికల్ క్యాంపును కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో 150మంది హృద్రోగ, మధుమేహం, బి.పి. ఇతర వ్యాధులను తనిఖీలు చేయించుకున్నారు. విశాఖపట్నం నుండి డాక్టర్ కె.రామ్మూర్తి, కార్డియోలజిస్టు డాక్టర్ జి.మహేష్, పల్మనాలజిస్టు డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ శరత్ కుమార్‌లు విచ్చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చైతన్య ఆధ్వర్యంలో డాక్టర్ సయ్యద్ రహీం తుల్లా పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఘంటసాల పాటలు, గానావధానం, కోలాటం, ఘంటసాల పాటలు ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఆచార్య డి.ఎస్. రావు, తిరుపతి పాణిగ్రాహి చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

కమ్యూనిస్టు నేత దివాకర్ నాయిక్ మృతి



దివాకర్ మృతికి నివాళులు అర్పిస్తున్న పార్టీ శ్రేణులు

జయపురం: కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకుడు దివాకర్ నాయిక్ మృతి పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి అన్నారు. ఆదివారం కార్మిక భవనంలో కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా పరిషత్ నిర్వహించిన దివాకర్ సంతాప సభలో మహంతి మాట్లాడుతూ దివాకర నాయిక్ శనివారం రాత్రి 11.10 గంటలకు భువనేశ్వర్‌లో మరణించారని తెలిపారు. దివాకర్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయక కార్యదర్శి రామకృష్ణ దాస్, పార్టీ నేతలు బసంత బెహరా, జయరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



ఎమ్మెల్యే రఘురాం మచ్చోను సత్కరిస్తున్న బీజేపీ కార్యకర్తలు

కొరాపుట్: జయపూర్ పట్టణంలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలన్నారు.

యువతి హత్య కేసులో నిందితుడి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు



మృతురాలు మంగళ దేయి నాగ్ (ఫైల్)

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి పరిధిలోని రంగాభంద్ గ్రామ అడవిలో ఇటీవల ఓ యువతి మృతదేహం లభ్యమైంది. మల్కన్‌గిరి పోలీసు ఐఐసీ రీగాన్‌కీండో కేసు దర్యాప్తు చేయగా.. ఆదివారం ఓ యువకుడిని అరెస్టు చేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం పాండామ్‌కు చెందిన 23 ఏళ్ల ఉమేష్ నాగ్ మంగళదేయి నాగ్ (25) ఏడాది నుంచి ప్రేమించుకుంటున్నారు. ఆమె గర్భవతి కాగా.. ఉమేష్ ఆమెను మల్కన్‌గిరి ఆస్పత్రికి వెళ్లి అబార్షన్ చేసుకోమని సూచించాడు. అందుకు ఆమె ఒప్పుకోలేదు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో మల్కన్‌గిరి సమితి ఛలాన్‌గూఢ గ్రామం వద్ద ఆమెను గొడ్డలితో నరికి హత్య చేసి మృతదేహాన్ని రంగాబంద్ అటవీ ప్రాంతంలో పడేశాడని ఎస్పీ వినోద్ పటేల్ తెలిపారు.

మద్యం విక్రయాలపై వివాదం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి అగస్తి హల్వ

కొరాపుట్: లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో మద్యం విక్రయాలపై వివాదం చెలరేగింది. ఆదివారం బీజేపీ కార్యదర్శి, లక్ష్మీపూర్ నియోజకవర్గ సమన్వయకర్త అగస్తి హల్వ నేతృత్వంలో నిరసన చేపట్టారు. లక్ష్మీపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో మద్యం విక్రయశాల నిర్వహిస్తుండటంపై మీడియాతో మాట్లాడారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని, ఇక్కడ ఎక్కువగా విదేశీ నకిలీ మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు. దీనిని తాగడం వల్ల చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు స్థానికులు కూడా ఈ మద్యం షాపు అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు ఒడిశా ఇంజినీర్లు మృతి



జి.భానుప్రకాష్(ఫైల్)



నళిని బిస్వాల్(ఫైల్)

కొరాపుట్: హైదరాబాద్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఇద్దరు ఇంజినీర్లు మృతి చెందారు. ఆదివారం వేకువజామున ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలో జయపూర్ బొయివీధికి చెందిన గిడుతూరి భానుప్రకాష్ (37), రౌర్కెలాకి చెందిన నళిని బిశ్వాల్ (33) మృతి చెందారు. వీరిద్దరూ కారులో ప్రయాణం చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. భానుప్రకాష్ తండ్రి జి.రాధాకృష్ణ జయపూర్ డీవీసీలో విశ్రాంత ఉద్యోగి. మృతులిద్దరూ స్నేహితులు కావడంతో హైదరాబాద్‌లో ఒకేచోట ఉంటున్నారు. భానుప్రకాష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. నళినీ బిశ్వాల్‌కి తలిదండ్రులు లేరు. దీంతో ఇద్దరి మృతదేహాలను జయపూర్ తీసుకొస్తున్నారు.

విషం తాగి యువకుడి మృతి



మల్కన్‌గిరి ఆస్పత్రి వద్ద ముయ పోడియామి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి నీలిగూఢ పంచాయతీ దుర్మాగూఢ గ్రామంలో శనివారం రాత్రి ముయ పోడియామి (22) అనే వ్యక్తి విషం తాగి మృతి చెందాడు. ముయ పోడియామి శనివారం ఉదయం నుంచి కేందు కులుకు సమీపంలోని అడవికి వెళ్లాడు. సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో గూటిలో ఉన్న పురుగు మందు తాగి పడిపోయాడు. అది చూసిన కుటుంబ సభ్యులు వెంటనే పోడియాను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోడియా పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీ కార్యకర్తల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఆందోళన చేపట్టారు. సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలకు నిప్పు పెట్టారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ప్రజాధనం దోచుకున్నారని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

లెట్రిన్ ట్యాంక్‌లో ఆవు



ఆవుని రక్షిస్తున్న సిబ్బంది

కొరాపుట్: జయపూర్ పట్టణంలో ఇరిగేషన్ కాలనీలో లెట్రిన్ ట్యాంకులో ఆవు పడటంతో నరకయాతన అనుభవించింది. పాడుబడ్డ ట్యాంక్ పైకప్పు ఊడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆవును సురక్షితంగా బయటకు తీసారు. అనంతరం పశువుల ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు.

నూర్పు చేస్తుండగా మంటలు



శాలిపేట గ్రామంలో అకస్మాత్తుగా చెలరేగిన మంటల ధాటికి అగ్నికి ఆహుతవుతున్న ట్రాక్టర్ ఇంజిన్, వరి చేను

టెక్కలి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం పంచాయతీ శాలిపేట గ్రామంలో ఆదివారం వరి చేను నూర్పు చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయింది. మరో వైపు మంటల ధాటికి వరి చేను కూడా కాలిపోయింది. హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన బల్లి అప్పలరాజు తన ట్రాక్టర్, నూర్పు యంత్రంతో శాలిపేట గ్రామానికి చెందిన మార్పు భూషణం అనే రైతుకు చెందిన సుమారు 2 ఎకరాల వరిచేనును నూర్పు చేస్తుండగా, అకస్మాత్తుగా ట్రాక్టర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనతో అంతా పరుగులు తీశారు. ఒక్క సారిగా మంటలు వ్యాపించి ట్రాక్టర్ ఇంజిన్ మొత్తం అగ్నికి ఆహుతి కాగా మరో వైపు వరి చేను కాలిపోయింది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోగా అంతా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఒక వైపు ట్రాక్టర్ యజమాని అప్పలరాజు, మరో వైపు రైతు భూషణం తమకు జరిగిన భారీ నష్టంతో బోరున విలపించారు.

జేఈఈ టాపర్‌కు స్పీకర్ అభినందనలు



ఓం ప్రకాష్ బెహరాకు అభినందనలు తెలియజేస్తున్న స్పీకర్ ఓం బిర్లా

కొరాపుట్: జేఈఈ మెయిన్‌లో ఆలిండియా టాపర్‌గా నిలిచిన ఒడియా విద్యార్థి ఓం ప్రకాష్ బెహరాను పార్లమెంట్ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా అభినందనలు తెలిపారు. ఆదివారం న్యూఢిల్లీలో తన కార్యాలయానికి పిలిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒడిశా విద్యార్థి ఈ విజయం సాధించడం పట్ల ఒడిశా రాష్ట్ర ప్రాథమిక విద్యా మంత్రి నిత్యానంద గొండో ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు.

• బలియాత్రకు శ్రీకారం



జాతర పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా మంత్రిగుడ గ్రామంలో అమ్మవారి గ్రామదేవత బలి జాతరకు ఆదివారం నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్రలు శ్రీకారం చుట్టారు. సమీప నది నుంచి పవిత్రి ఇసుకను గిరిజనులు తట్టెలతో తీసుకొచ్చారు. అందులో గోధుమలు, జొన్నలు, వరి తదితర విత్తనాలు వేశారు. అవి మెలకెత్తిన తర్వాత బలి జాతర నిర్వహిస్తారు.

బాధిత కుటుంబాలకు భరోసా



నారాయణపట్న సమితిలో నష్టం అంచనా వేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత



గిరిజన మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

కొరాపుట్: కాల వైశాఖీ బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అండగా నిలిచారు. ఆదివారం నారాయణ పట్న సమితి గుమండి, తెంతులిపాదర్, పాద పాదర్ గ్రామాల్లో పర్యటించారు. 15 ఇళ్లు కూలిపోవడంతో బాధితులకు బియ్యం, నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

• గ్రామాన్ని విభజించవద్దు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన గిరిజనులు

కొరాపుట్: తమ గ్రామాన్ని రెండు భాగాలుగా విడదీయవద్దని కుసుంపల్లి గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ నివాసానికి వచ్చి ఫిర్యాదు చేశారు. జిల్లాలోని కొసాగుమ్డ సమితి కుసంపల్లి గ్రామాన్ని కుసుంపల్లి, కట్టియానిగుడ రెవెన్యూ గ్రామాలుగా విడదీయాలని ప్రభుత్వం నిర్ణయించిదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

గడువు తీరిన మందులను చట్టబద్ధంగా కాల్చుతాం



రెయిన్‌బో ఇండస్ట్రీస్ ప్రతినిధులతో ఒప్పంద పత్రం, కరపత్రాలతో ఏడీ చంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్:

గడువు తీరిన మందులను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి పొందిన బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా కాల్చుతామని జిల్లా డ్రగ్ ఏడీ చంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇదివరకు ఏవైనా గడువు తీరిన (ఎక్స్పైరీ) మందులు కొన్నింటికి కంపెనీలు రిటర్న్ పాలసీ కింద డబ్బులు చెల్లించేవని, మరికొన్నింటికి పాలసీ లేకపోవడంతో సంబంధిత ఫార్మా, జనరిక్, పీసీడీ డిస్ట్రిబ్యూటర్స్ బహిరంగ ప్రదేశాల్లో కుప్పలుగా పెట్టి కాల్చేయడమో.. లేదంటే పూడ్చేయడమో చేసేవారన్నారు. ఇలా చేయడం వల్ల పర్యావరణానికి, మానవ మనుగడకి ప్రమాదమని అన్నారు. తాజాగా జిల్లాలోని లావేరులో ఉన్న రెయిన్‌బో ఇండస్ట్రీస్‌తో ఒప్పందం అయ్యిందని, బయో వేస్ట్ వెహికల్‌లో అక్కడికి తీసుకెళ్లి కాల్చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలిసారి మన జిల్లాలోనే ఈ ప్రక్రియ మొదలు పెట్టామని, త్వరలోనే డిస్ట్రిబ్యూటర్స్, మందుల దుకాణాల వారితో సమావేశంలో అంతా వివరిస్తామన్నారు. రెయిన్‌బో ఇండస్ట్రీస్ ప్రతినిధులు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానం చేసిన మంత్రి



రక్తదానం చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించారు. అనంతరం స్థానిక యువత నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన కూడా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు

రాజాం సిటీ: జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొగిరి సురేష్‌బాబుపై రాజాం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైందని ఎస్సై వై.రవికిరణ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. జనసేన సభ్యత్వ నమోదు కార్డులు స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఆర్‌కే కాంప్లెక్స్‌లో ఇస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తెలియజేయడంతో ఒమ్మి గ్రామానికి చెందిన చిత్తిరి నాగరాజు శనివారం ఉదయం అక్కడకు చేరుకున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జనసేన నాయకుడు పొగిరి సురేష్‌బాబు నువ్వెందుకు ఇక్కడకు వచ్చావని నాగరాజును దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించడంతో పాటు కాలితో తన్నాడు. పైగా తన అనుచరులతో దాడి చేసేందుకు ప్రయత్నించగా.. బాధితుడు తప్పించుకుని బయటకు వచ్చి జనసేన నాయకులకు విషయం తెలియజేశాడు. అనంతరం పొగిరి సురేష్‌బాబుపై శనివారం సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ..ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

చంద్రబాబు పుట్టిన రోజు.. మనకు వంచన దినం

- అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి, తదితరులు

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినాన్ని ఎస్సీ రిజర్వేషన్‌ల వంచన దినంగా పాటిద్దామని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్లను తొలగించాలనే ఆలోచన దుర్మార్గమన్నారు. గత వైఎస్సార్ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల సర్వేను క్యాస్ట్ సర్వేగా పరిగణిస్తూ జీఓ 91 విడుదల చేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఏప్రిల్ 20న చంద్రబాబు పుట్టిన రోజును ఎస్సీ రిజర్వేషన్ల వంచనదినంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం వంచనదినం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దారాన వెంకటేష్ , బుదరాయవలస మధుసూదనరావు, వేమల వంశీ, లోపింటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

23న సాలూరులో జాబ్‌మేళా



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: సాలూరు పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఉదయం 9గంటలకు జాబ్ మేళా జరగనుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డీగ్రీ చదువుకుని 18 నుండి 28 ఏళ్లు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 9గంటల నుంచి సత్యసాయి డిగ్రీ కళాశాల, సాలూరులో జరిగే జాబ్ మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ జాబ్ మేళాకు 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94947 77553, 73825 59022 నంబర్లలో సంప్రదించవచ్చని ప్రకటనలో స్పష్టం చేశారు.

- చిన్నారులపై ఆగని దారుణాలు
- రామభద్రపురం, గంట్యాడ, బుచ్చన్నకోనేరులో వరుస సంఘటనలు
- తాజాగా విజయనగరం మేదర వీధిలో దారుణం



పసి మొగ్గలను చిదిమేస్తున్నారు...

విజయనగరం క్రైమ్: కామాంధులు కోరలు చాస్తున్నారు.. పసిమొగ్గలనే లక్ష్యంగా చేసుకుని చిదిమేస్తున్నారు.. క్షణికావేశంలో మృగాళ్లు ఘోరాలకు పాల్పడుతున్నారు.. వెరసి చిన్నారులు కన్నవారికి కూడా చెప్పుకోలేని దారుణాలకు గురవుతున్నారు. మొన్న రామభద్రపురం, నిన్న గంట్యాడ, తాజాగా విజయనగరం బుచ్చన్నకోనేరు, మేదరవీధుల్లో చిన్నారులపై దారుణాలు జరిగాయి. విజయనగరం మేదరవీధిలో అభం, శుభం ఎరుగని నాలుగేళ్ల చిన్నారి కామాంధుడి దాహానికి బలైంది. రామభద్రపురం, గంట్యాడలో కూడా చిన్నారులకు ఆశ చూపి తమ కామవాంఛ తీర్చుకున్నారు కొంత మంది మృగాళ్లు. ఈ సంఘటనల్లో నిందితులందరూ 40 ఏళ్లకు పైబడిన వారే. రామభద్రపురం సంఘటనలో నిందితుడి వయసు 58 ఏళ్లు.. గంట్యాడ సంఘటనలో నిందితుడి వయసు 45 ఏళ్లు.. బుచ్చన్నకోనేరు సంఘటనలో అయితే నిందితుడి వయసు 70 ఏళ్లకు పైనే ఉంది. మేదరవీధి సంఘటనలో నిందితుడి వయసు కూడా నాలుగు పదులు. విచిత్రమేంటంటే ఈ నాలుగు సంఘటనలలో బలైన చిన్నారులకు నిందితులు తెలిసిన వారు కావడం విశేషం.

ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి..

చిన్నారులపై దారుణాలకు పాల్పడిన వారు తెలిసిన వారే కావడంతో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితిలో తల్లిదండ్రులున్నారు. క్షణికావేశానికి లోనైన చిన్నారులు చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని దారుణాలకు ఒడిగడుతున్నారు. దారుణాలకు బలైన చిన్నారులు అనారోగ్యం బారిన పడితే తప్ప జరిగిన ఘోరం తల్లిదండ్రులకు తెలియని పరిస్థితి. ఇటువంటి మృగాళ్లను కఠినంగా శిక్షించాల్సింది పోలీసులు, న్యాయమూర్తులే. అయితే రాతపూర్వకంగా ఫిర్యాదు అందితే తప్ప పోలీసులు కేసు నమోదు చేయలేని పరిస్థితి. నిందితులు తెలిసిన వారు కావడం, విషయం బయటకు పొక్కితే కుటుంబం పరువు పోతుందనే భయంతో చాలా మంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం లేదు. కొంతమంది ఫిర్యాదు చేసినా విచారణ నత్తనడకన సాగుతుండడంతో ఫిర్యాదుదారులే విసిగిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి నేపథ్యంలో కామాంధుల అరాచకాలకు అడ్డకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

శిక్ష తప్పదు..

చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడుతున్నాం. షీ టీమ్స్ ఎప్పటికప్పుడు శక్తియాప్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. చిన్నారుల పట్ల కన్నవాళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి.

– గోవిందరావు, డీఎస్పీ, మహిళా పోలీస్‌స్టేషన్, విజయనగరం

దారుణం..

చిన్నారులపై అఘాయిత్యాలు జరగడం దారుణం. వారానికో సంఘటన వెలుగుచూస్తోంది. పరువు పోతుందనే భయంతో చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఇది సరికాదు. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడు ఇతరులు ఇటువంటి సంఘటనల జోలికి వెళ్లరు. స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన సదస్సులు, చర్చాగోష్టిలు నిర్వహిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, మానసిక వైద్యుడు, విజయనగరం

ఇవేం ఆంక్షలురా బాబూ..!



చింతపల్లి తీరంలో నిలిపిన పడవలు

- మత్స్యకారుల జీవనభృతిపై ఆంక్షలు..
- ఇంతవరకు వేట నిషేధం భృతి అందలేదు
- ఇదుగో..అదుగో.. అంటూ కాలయాపన
- తాజాగా భృతి పొందిన వారికి సంక్షేమ పథకాలు కట్ అంటూ మెమో జారీ
- ఆందోళనలో మత్స్యకారులు

పూసపాటిరేగ: మత్స్యకారుల జీవనభృతిపై ప్రభుత్వం ఆంక్షలు పెడుతూ మెమో జారీ చేయడంపై గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు. జీవనభృతి మంజూరైన మత్స్యకారులు సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఎంతో కాలంగా మత్స్యకారులకు వస్తున్న వేట నిషేధ భృతిపై ఇలా ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. మత్స్య సంపద వృద్ధి కోసం ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధం అమలు చేయడం విధితమే. ఈ కాలంలో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. 2019 నుంచి ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఏటా మత్స్యకార భరోసా అందజేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వస్తే రూ. 20 వేల జీవనభృతి ఇస్తామని చెప్పిన నాయకులు మొదటి ఏడాది భృతి ఇవ్వకుండా దాటవేశారు. ఈ ఏడాది మే నెలలో భృతి ఇవ్వాల్సి ఉండగా.. ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు విధించడం దారుణం. జిల్లాలో గతేడాది మత్స్యకార భరోసాకు 3798 మందిని అర్హులుగా తేల్చారు. వీరందరూ వేట విరామ సమయంలో భృతి పొందినప్పటికీ.. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరాతో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందారు. కాని నేటి కూటమి ప్రభుత్వం మాత్రం జీవన భృతి పొందిన మత్స్యకారులు ఆడబిడ్డ నిధి, చంద్రన్న పెళ్లికానుక, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు అనర్హులుగా తేల్చింది. అలాగే 60 ఏళ్లు దాటిన వ్యక్తులు, 300 యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించిన వారు, గ్రామీణ ప్రాంతంలో రూ. 1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ. 1.44 లక్షలకు మించి ఆదాయం ఉన్నవారు, 3 ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్టు ఉన్న మత్స్యకారులను అనర్హులుగా ప్రకటించారు. దీంతో ఇవేం ఆంక్షలురా బాబూ అంటే గంగపుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమం తప్పదు..

వేట నిషేధ భృతి చెల్లించాల్సిన కూటమి సర్కారు లేనిపోని ఆంక్షలు విధించడం దారుణం . భృతి పొందిన వారిని ఇతర సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తే ఉద్యమం చేయక తప్పదు.

బర్రి చినఅప్పన్న , జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం.

ఘనంగా సీఎం పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: సీఎం చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విజయచంద్ర కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అలాగే జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబులాంటి విజనరీ లీడర్ దేశంలో ఇంకొకరు లేరన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. బలిజిపేట మండలంలో రక్తదాన శిబిరం నిర్వహించి రక్తం యూనిట్లను జిల్లా ఆస్పత్రికి అందజేశారు. కార్యక్రమంలో మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విజయనగరం క్రైమ్: వారం రోజుల పాటు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నగరంలోని న్యూపూర్ణ జంక్షన్ వద్దనున్న అగ్నిమాపక స్టేషన్ సిబ్బంది ఈ వారం రోజులు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన నష్ట నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇదిలా ఉంటే ఆదివారం స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్రగిరి, లంకె శ్రీనివాసరావు, డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే తీసుకోవాల్సిన ఉపశమన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ అధికారులు సోమేశ్వరరావు, సంతోష్‌కుమార్, మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి...



రామారావు మృతదేహం



సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

గంట్యాడ: ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన వర్రి రామారావు (45) ఆదివారం ఉదయం మదనాపురం జంక్షన్ నుంచి ట్రాక్టర్‌పై గ్రామంలోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపైనున్న గొయ్యిని తప్పించేక్రమంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో అక్కడికక్కడే రామారావు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

లారీ ఢీ కొట్టడంతో ఒకరు..

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. సాలూరు మండలం మంచాడవలసకు చెందిన తంబరి బంగారయ్య, తూలిగి బంగారయ్యలు సాలూరు నుంచి మంచాడవలసకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. సరిగ్గా జీగిరాం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తంబరి బంగారయ్య మృతి చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

తెట్టంగిలో చోరీ..

గుర్ల: మండలంలోని తెట్టంగిలో జమ్ము పైడినాయుడు ఇంటిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలుగా గురజాడ జయంతి, వర్ధంతి

- కవులు, రచయితల డిమాండ్



మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ

విజయనగరం టౌన్: ప్రభుత్వ అధికార కార్యక్రమాలుగా గురజాడ అప్పారావు జయంతి, వర్ధంతులను నిర్వహించాలని జిల్లాకు చెందిన కవులు, రచయితలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గురజాడ స్వగృహంలో సాహిత్య సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో మహాత్మా మన్నించు పేరిట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు మాట్లాడుతూ.. తెలుగు సమాజానికి ఆధునిక ఆలోచనలందించిన మహాకవి గురజాడ అని కొనియాడారు. దేశభక్తి గీతాన్ని రాసిన మహాకవిని ప్రధాని నుంచి ముఖ్యమంత్రుల వరకూ అందరూ స్మరించుకుంటారు గాని ఆయన పేరిట అవార్డు మాత్రం ఇవ్వరని ఆవేదన వ్యక్తం చేశారు. గురజాడ జయంతి, వర్ధంతిలను ఇకపై అధికారిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో సాహిత్య సంస్థల ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, డాక్టర్ జక్కు రామకృష్ణ, చీకటి దివాకర్, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గాలి బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



రంగరాయపురంలో రహదారిపై పడిన విద్యుత్ స్తంభం



రహదారిపై కూలిన చెట్టు

బొబ్బిలిరూరల్: అకస్మాత్తుగా వచ్చిన గాలి బీభత్సానికి ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఆదివారం సాయంత్రం నాలుగుగంటల సమయంలో ఒక్కసారిగా భారీ గాలులు వీయడంతో బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడగా, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మరో వైపు మామిడి, జీడిమామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడిప్పుడే అందివస్తున్న జీడిమామిడి, మామిడి కాయలు గాలుల కారణంగా నేలరాలాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగరాయపురం, పెంట గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు నేలకూలగా వైర్లు రహదారులపై పడి ఉండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలతో పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా పునరుద్ధరణకు విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

పవన్ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు తీవ్ర నష్టం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టెక్కలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనాలోచిత నిర్ణయాలతో ఈ రోజు బియ్యం ఎగుమతులు లేక రైతులు తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం టెక్కలిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీజ్ ద షిప్ వ్యవహారంలో అక్రమాలను వెలికితీస్తామని చెప్పి ఎందుకు మౌనంగా ఉన్నారని దువ్వాడ ప్రశ్నించారు. గతంలో ఏపీ నుంచి విస్తారంగా సన్న రకాలు ఎగుమతులు జరిగాయని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.2900 ధర పలికిన సన్న రకాల ధర ఈ రోజు రూ.1700కు పడిపోయిందని అన్నారు. అవి కూడా కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సన్న రకాలను ప్రోత్సహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటనలతో ఉత్తరాంధ్రతో పాటు ఇతర జిల్లాల్లో విస్తారంగా సన్న రకాలు పండించారని, ఇప్పుడు ధరలు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని దువ్వాడ మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో విత్తు నుంచి విక్రయం వరకు. రైతుల సంక్షేమం కోసం అధికారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసిన పరిస్థితులను ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం నుంచి సుమారు 31 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, ఇదే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గతంలో గోల చేశారని ఇప్పుడు అదృశ్యమైన మహిళల్ని ఎందుకు తీసుకురావడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రెండు బడ్జెట్‌లలో ఉత్తరాంధ్రకు వచ్చిన ప్రయోజనమేమిటని దువ్వాడ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాది కాలంలో సుమారు 80 శాతం పనులు పూర్తి చేశారని ఇప్పుడు టీడీపీ నాయకులు పోర్టు కాంట్రాక్టుల కోసం కుమ్ములాడుకుంటున్నారు తప్ప పోర్టును పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. బారువాను మరో గోవా చేస్తామంటూ ఇటీవల కేంద్ర మంత్రి చేసిన ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని శ్రీనివాస్ అన్నారు. లింగాలవలస గ్రామంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రగల్భాలు పలకడం ఆపేసి ఎన్నికల మునుపు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు మన్యం విద్యార్థులు



జాతీయ స్థాయి థాంగ్-టా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పార్వతీపురం టౌన్: జాతీయ స్థాయి అండర్-17థాంగ్-టా పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ అనిల్ శర్మ తెలిపారు. జిల్లాకు చెందిన ఏడుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఢిల్లీలో ఈ నెల 22 నుంచి 27 వరకు జరగనున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

వేసవి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

పాలకొండ రూరల్: మూగజీవాలకు వేసవిలో వచ్చే వ్యాధులపై పశుపోషకులు, పెంపకందారులు, పాడిరైతులంతా అవగాహన పెంచుకోవాలని పాలకొండ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రభామాణిక్యరావు సూచించారు. వేసవికాలంలో గొర్రెల్లో వచ్చే సాధారణ వ్యాధులు, వాటిని నివారణ చర్యలపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వేసవిలో సూక్ష్మజీవుల కారణంగా చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం , ఊపిరితిత్తుల్లో నెమ్ము లేదా న్యూమోనియో, పొగాళ్లు లేదా బురద పుండ్లు, మితువ కాళ్లు, గొంతువాపు వ్యాధులు వంటివి గొర్రెలకు వ్యాప్తి చెందుతాయి. గాలికుంటు, నీలినాలుక, బొబ్బరోగం, అమ్మతల్లి, నోటిపుండ్లు వంటివి వైరస్‌ల ద్వారా ఒకదాని నుంచి మరొకదానికి సంక్రమించి మందకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తేలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వల్ల ఎక్కువ ప్రమాదం ఉంటుంది. బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం, కడుపును కాళ్లతో తన్నుకోవడం, కడుపు ఉబ్బడం, నల్లగా దుర్వాసన వచ్చే పారుడు, నోటి నుంచి నురగ రావడం, ఫిట్స్ వంటి లక్షణాల ద్వారా రోగాలను గుర్తించవచ్చు. ఈ సమస్యలకు చికిత్స అందించే క్రమంలో వైద్యుల సలహా మేరకు చర్యలు తీసుకోవాలి. రోగ నివారణకు అవసరమగు టీకాలు వెంటనే వేయించాలి. మూడేళ్ల వయసు నిండిన గొర్రె పిల్లలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయాలి. మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తర్వాత బూస్టర్ డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా వేసవిలో వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు.